నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, ఏప్రిల్ 19: పట్టణంలోని 11కేవీ గోదావరి వ్యాలీ ఫీడర్ పరిధిలో శనివారం మరమ్మతులు చేపడుతున్నట్లు టౌన్-2 ఏఈ సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రహదారి, రాజీవ్ చౌక్, ధర్మపురి బైపాస్ రోడ్, గాయత్రీ ఆలయ ప్రాంతం, గొల్లపల్లి రోడ్, తాతమ్మ గుడి ప్రాంతం, విజయపురి, దయాల్ నగర్, బైపాస్ రోడ్, సీతారాం నగర్ కాలనీలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు.

మల్యాల, ఏప్రిల్ 19: మండలంలోని మద్దుట్ల, రాంపూర్ గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో 33/11 కేవీ లైన్లకు శనివారం మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్, ఓగులాపూర్, మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లి, రామన్నపేట, నూకపల్లి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, తాటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున తాటిపల్లి, లంబాడీపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్యాల ఏఈఈ దయానంద్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెగడపల్లి, ఏప్రిల్ 19: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్ఐ జాడి రామకృష్ణ తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి నుంచి అక్రమంగా పెగడపల్లికి ఇసుకను తీసుకువస్తుండగా, స్థానిక నంది చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేను కలిసిన రైతులు

కథలాపూర్, ఏప్రిల్ 19 : కథలాపూర్ మండలం భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను విన్నవించారు. 40 కిలోల బస్తాకు కిలోన్నర, రెండు కిలోలు అదనంగా తూకం వేస్తేనే రైస్ మిల్లర్‌లు తీసుకుంటున్నారని, లేకుంటే బస్తాలను వాపస్ పంపిస్తున్నారని తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఫోన్‌లో మాటాడారు. అదనంగా తూకం విషయంపై రైస్‌మిల్లర్లతో, రైతులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- స్వీప్ కార్యక్రమంపై సమీక్ష

కంట్రోల్ రూంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, తదితరులు

జగిత్యాల, ఏప్రిల్ 19: జిల్లాలో అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఆమె అదనపు కలెక్టర్లతో కలిసి వివిధ శాఖల అధికారులతో స్వీప్ కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన ప్రాంతాల్లో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంచే దిశగా వివిధ శాఖల ద్వారా స్వీప్ కార్యక్రమాలను ఈనెల 20 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు రోజువారీగా ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యా సంస్థలకు సెలవులు ఉన్నందున యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్డీవో మధుసూదన్, స్వీప్ నోడల్ అధికారి మదన్‌మోహన్, ఎన్సీసీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు, స్వీప్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకుల పరిశీలన

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల కంట్రోల్ రూంను పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు సమీర్ నరైంతర్ శుక్రవారం పరిశీలించారు. అంతకు ముందు ఆయనను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు.

శిక్షణకు హాజరైన విద్యుత్ అధికారులు, సిబ్బంది

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల, ఏప్రిల్ 19: విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఆర్‌డీ చీఫ్ మేనేజర్ ప్రభాకర్ సూచించారు. పట్టణంలో శుక్రవారం జిల్లాలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి అంతర్గత సమర్థత అభివృద్ధి కోసం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేపట్టాలని సూచించారు. లైన్ పనులు చేసేటప్పుడు స్పాట్ ఎర్తింగ్ చేసుకొని జాగ్రత్తగా పనులు చేయాలని సూచించారు. 33కేవీ, 11కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ చేపడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎస్ఈ సత్యనారాయణ, గంగారాం, రవీందర్, నగేశ్ కుమార్, వెంకటేశ్వర్లు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలి

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి
- విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 19: విద్యార్థులు బాల్యం నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, డిజిటల్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాంధించిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వ్యాసరచనలో జడ్పీహెచ్ఎస్ ధరూర్‌క్యాంపు పాఠశాల విద్యార్థి సురేంద్రకు మొదటి స్థానం, స్లోగన్ రైటింగ్ పోటీలో ఎన్ ఆంజనేయులు ప్రథమ, జడ్పీహెచ్ఎస్ రామన్నపేట పాఠశాల విద్యార్థి ఎన్ ఆంజనేయులు ప్రథమ, డ్రాయింగ్ పోటీలో వర్షిణి ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులను డీఈవో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పొదుపు పద్ధతులను నేర్చుకోవాలని, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 19: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ ధాన్యంతో నిండిపోవడంతో పాటు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అడ్డీ ఖరీదు దారుల విజ్ఞప్తి మేరకు శనివారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి శని, ఆదివారం మార్కెట్‌కు సరుకులు తీసుకురావద్దని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్ యార్డులో యథావిధిగా కొనుగోళ్లు చేపడుతామని తెలిపారు. రైతుల గమనించి సహకరించాలని కోరారు.

నీటి కుండీలో పడి బాలుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ఇటుక బట్టీ వద్ద గల నీటి కుండీలో ప్రమాదవశాత్తు ఓ బాలుడు పడి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బేల గ్రామానికి చెందిన బైగాని సాంబార్ భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, నాలుగు నెలల క్రితం సాంబార్ పిల్లలతో వచ్చి మండల కేంద్రంలోని పాలబోయిన రమేశ్‌కు చెందిన ఇటుక బట్టీలో కూలి పనులు చేస్తున్నది. ఈ క్రమంలో గురువారం రాత్రి సాంబార్ కుమారుడు పరమేశ్వర్ (7) స్థానిక పిల్లలతో కలిసి నీటి కుండీ వద్దకు స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా పరమేశ్వర్ ప్రమాదవశాత్తు నీటి కుండీలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. బైగాని సాంబార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

వసతులు కల్పిస్తేనే తైబజారు రుసుం చెల్లిస్తాం

కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న కూరగాయల వ్యాపారులు, మహిళా రైతులు

కోరుట్ల, ఏప్రిల్ 19: పట్టణంలోని గడి గురుజు కూరగాయల మార్కెట్‌లో వసతులు కల్పిస్తేనే తై బజారు రుసుం చెల్లిస్తామని కూరగాయల వ్యాపారులు, రైతులు తేల్చిచెప్పారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిని వ్యాపారులు, మహిళా రైతులు కలిసి సమస్యలను విన్నవించారు. కూరగాయల మార్కెట్‌లో కనీస వసతులు లేవని, మరుగుదొడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వేసవిలో కనీసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయలేదని, రహదారులపై ఎండ వేడికి తాళలేక కూరగాయలు విక్రయిస్తూ అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. తైబజారు వేలం దక్కించుకున్న గుత్తేదారు ఇష్టారీతిలో రుసుం వసూలు చేస్తున్నాడని కమిషనర్‌కు విన్నవించారు. మార్కెట్‌లో వసతులు కల్పిస్తామని, నిబంధనల ప్రకారం రుసుం చెల్లించాలని వ్యాపారులు, రైతులకు కమిషనర్ నచ్చజెప్పారు. ఇక్కడ వ్యాపారులు గంగు, హన్మక్క, భూమక్క, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సంపత్ రావు

రాయికల్, ఏప్రిల్ 19: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి సంపత్ రావు రైతులకు సూచించారు. అల్లీపూర్, ఆలూరు, అలియా నాయక్ తండాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. డీఆర్డీవో మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి, ఏపీఎం శ్రీనివాస్ చక్రవర్తి ఉన్నారు.

కంటి వైద్య శిబిరం

జగిత్యాల, ఏప్రిల్ 19: కరీంనగర్‌లోని రేకుర్తి కంటి దవాఖాన సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. 200 మందికి పైగా పరీక్షలు చేశారు. 96 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. ఇందులో మొదటి దఫాలో 35 మందిని కరీంనగర్‌లోని రేకుర్తి కంటి దవాఖానకు బస్సులో పంపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జగిత్యాల అధ్యక్షుడు తాటిపాముల వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి వడ్లగడ్డ శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, మాజీ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్ కుమార్, శ్రీరాముల సుదర్శన్, రీజినల్ చైర్మన్ శివ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, లయన్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం

వేడుకల్లో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు, అధికారులు

కొడిమ్యాల, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్యాల ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి హాజరై మాట్లాడారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పిల్లలు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సుజాత, మమత, కవిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ

మారుతీనగర్, ఏప్రిల్ 19: అవగాహనతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి మల్లికార్జున్‌యాదవ్ పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక లక్ష్మి థియేటర్‌తో పాటు ఓ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టే చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆంజనేయులు, వహీదుల్లాఖాన్, భాస్కర్, సంతోష్‌కుమార్, అమర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతం

ధర్మపురి, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి మాదిగల సత్తా చాటుతామని అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్కాల గంగారాం పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో 80లక్షలకు పైగా మాదిగ సామాజికవర్గం ఉందని, కాంగ్రెస్ పార్టీ ఒక్క పార్లమెంట్ స్థానం నుంచి కూడా మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వివేక్ వెంకటస్వామి తన ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయం చేస్తున్నారన్నారు. అంబేద్కర్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమాండ్లు, నాయకులు అవునూరి శ్రీకాంత్, ముడుసుల సత్తయ్య, సుద్దాల అరవింద్, ప్రశాంత్, కట్ట రాజలింగు పాల్గొన్నారు.

కుష్టు నిర్ధారణ పరీక్షలు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మల్యాల, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ నేతృత్వంలో కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 120 మందికి నిర్ధారణ పరీక్షలు చేయగా, ఒకరికి మాత్రమే కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కుష్టువ్యాధిని ప్రాథమిక లక్షణాలు ఉన్నప్పుడే గుర్తించాలని, లేనిపక్షంలో అంగవైకల్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, సిబ్బంది లక్ష్మి, దేవాసింగ్, రమేశ్, నాగలక్ష్మి, సునంద, రోహిదాస్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఫొటోలు, పూజా సామగ్రి ధ్వంసం

వెల్గటూర్, ఏప్రిల్ 19: జగదేవ్‌పేటలోని నగరి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఫొటోలు, పూజా సామగ్రిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి పక్కనే ఉన్న పొలం, కాలువలో పడేశారు. శుక్రవారం ఉదయం హనుమాన్ దీక్షాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం అందించగా వారు వచ్చి ఫొటోలపై ఉన్న వేలి ముద్రలను సేకరించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల, ఏప్రిల్ 19: పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. కాగా, శుక్రవారం విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్, జిజ్ఞాస ప్రాజెక్టు పర్యవేక్షకుడు డాక్టర్ రాజేశం, జిజ్ఞాస కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశ్, అధ్యాపకులు అభినందించారు.

విద్యుదాఘాతంతో బర్రె మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సర్పరాజ్‌పూర్ గ్రామంలో కొక్కు గణేశ్ అనే రైతుకు చెందిన బర్రె శుక్రవారం గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా షాక్ వచ్చి మృతి చెందింది. నిరుపేద రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19: బండలింగాపూర్ శివారులోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీల్లో రూ.93 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. కమ్మర్‌పల్లి నుంచి మెట్‌పల్లి వెళ్తున్న ఓ కారులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.93 వేల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నువ్వు, కూరగాయల తోటల సందర్శన

నువ్వు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 19: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామం రాయికల్ మండలం అల్లీపూర్‌లో సాగు చేస్తున్న నువ్వు, పెసర, కూరగాయల తోటలను శుక్రవారం శాస్త్రవేత్తలు సందర్శించారు. నువ్వులో జేసీఎస్ 1020, జేసీఎస్ 2454, శ్వేత రకాలను రైతులు విత్తనోత్పత్తి చేస్తున్న క్షేత్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, డాక్టన్ ఎన్ బలరాం, డాక్టర్ రజినీదేవి, డాక్టర్ స్వాతి, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కోరుట్ల, ఏప్రిల్ 19: పట్టణంలోని రశ్మిధర్‌తేజ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఏఈలు మహేశ్, హేమంత్, కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని జడ్పీ సీఈవో రఘువరన్ నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో మాట్లాడారు. ఆయన వెంట వ్యవసాయాధికారి దీపిక, ఏఈవో నరేశ్, సహకార సంఘం సీఈవో మంత్రి సతీశ్, తదితరులున్నారు.

ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రఘువరన్

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 19: 2024-25 విద్యా సంవత్సరానికి గానూ రెవ్యూటెడ్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల స్కీం కోసం జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాశాలల యాజమాన్యాలు ఐదేళ్లకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్‌తో పాటు ఈపాస్ వెబ్‌సైట్ https;\\telanganaepass.cgg.gov.in ద్వారా ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

డీఎస్పీ విచారణ

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన మేర్గు కొమురయ్యను అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణ ఈనెల 14న కులం పేరుతో దూషించినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ క్రమంలో గ్రామంలో శుక్రవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి విచారణ చేపట్టారు. ఇక్కడ ఎస్ఐ ఉమాసాగర్ ఉన్నారు.

రైలు కిందపడి బాలిక మృతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 19: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ రైల్వే ట్రాక్ వద్ద కైకేయి (15) రైలు కిందపడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం కార్లమాల్ గ్రామానికి చెందిన కైకేయి కుటుంబసభ్యులు మేడిపెల్లి సమీపంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. గురువారం తల్లిదండ్రులు జగిత్యాలలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి కైకేయి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారుజామున రైల్వే ట్రాక్‌పై మృతిచెంది ఉంది. కైకేయికి మానసిక పరిస్థితి బాగా లేదని తండ్రి మన్మద తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సాయిరెడ్డి పేర్కొన్నారు.

వెదురుబొంగులు స్వాధీనం

సారంగాపూర్, ఏప్రిల్ 19: రేచపల్లి శివారులోని కెనాల్లో అక్రమంగా నిల్వఉంచిన వెదురు బొంగులను శుక్రవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని కల్లెడ బీట్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్షన్ అధికారి అమీద్, బీట్ అధికారి కిరణ్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కథలాపూర్, ఏప్రిల్ 19: కథలాపూర్ మండలం సిరికొండ, దూలూర్, బొమ్మెన, తక్కళ్లపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. అదనంగా ధాన్యం తూకం వేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్